
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 25 ఆగస్టు 2024 | 5





జ్వరాల విజృంభణ



మండపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైరల్ జ్వరాలతో చికిత్స పొందుతున్న బాధితులు

- జ్వరాల బాధితులతో ఆస్పత్రులు ఫుల్
- ఓపీలో ఎక్కువ శాతం ఫీవర్లదే..
- ఆస్పత్రుల్లో నిండిపోతున్న బెడ్‌లు
- దోమల వ్యాప్తితో ప్రబలుతున్న రోగాలు



మండపేట ప్రభుత్వ ఆస్పత్రి ఓపీ వద్ద క్యూ కట్టిన రోగులు

వాతావరణంలో మార్పులు, అధ్వానంగా పరిసరాలు, పెరిగిపోయిన దోమలు..కారణం ఏదైనా జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం జ్వరాల సీజన్ నడుస్తోంది. చాలా మంది అస్వస్థతకు గురవుతున్నారు. జ్వర పీడితులతో ఆస్పత్రుల బెడ్‌లు నిండిపోతున్నాయి. ఏ ఆస్పత్రిలో చూసినా క్యూలు కనపడుతున్నాయి. ముఖ్యంగా డెంగ్యూ, చికున్‌గున్యా, టైఫాయిడ్, మలేరియా కేసులు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో పెరుగుతున్నాయి.



పల్లెలు, పట్టణాల్లో వైరల్ జ్వరాలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి):


గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాతావరణంలో మార్పులు వచ్చాయి. ముఖ్యంగా డ్రైన్లు అధ్వానంగా మారడంతో దోమలు విపరీతంగా పెరిగి ప్రజల ఆరోగ్యం పాలిట ప్రాణాంతకంగా మారుతున్నాయి. మరోవైపు తాగునీరు కూడా కలుషితం కావడంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అనేకమంది రోగాలు బారిన పడుతున్నారు. దగ్గు, రొంపతో పాటు వైరల్ ఫీవర్లు, మలేరియా, డెంగ్యూ జ్వరాలతో బాధపడుతున్నారు. అనారోగ్య బాధితులతో ఆసుపత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. అమలాపురం పట్టణంలోనే అనేక మంది డెంగ్యూ బారిన పడి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి పరిస్థితి దారుణంగా ఉంది. డెంగ్యూ ఫీవర్ సోకిన వారికి ప్లేట్‌లెట్స్ పడిపోతుండడంతో వారి ఆరోగ్య పరిస్థితి ఒక సందర్భంలో క్షీణిస్తోంది. మరికొందరు రకరకాల ఇన్ఫెక్షన్ల బారిన పడడంతో వారి ఆరోగ్య పరిస్థితులు విషమిస్తున్నాయి. అక్కడికీ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మున్సిపల్, పంచాయతీ అధికారులు దోమల నివారణకు తమవంతు కృషి చేస్తున్నప్పటికీ వాతావరణ పరిస్థితుల్లో వచ్చిన మార్పులతో వైరల్ ఫీవర్లు తగ్గుముఖం పట్టడంలేదు. ఫలితంగా ప్రజల ఆరోగ్యం పడకేసింది. గత పక్షం రోజుల నుంచి ఒక వైపు వర్షాలు మరో వైపు ఎండల తీవ్రతతో ఏర్పడుతున్న మిశ్రమ వాతావరణం వల్ల ఈ తరహా పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని ప్రభుత్వ వైద్యాధికారులు సైతం ఆందోళన చెందుతున్నారు. ప్రజల్లో రోగ నిరోధక శక్తి తగ్గిపోవడంతో వైరల్, డెంగ్యూ, మలేరియా జ్వరాల బారిన పడడంతో ఆరోగ్యం క్షీణించడం, ప్లేట్‌లెట్స్ పడిపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. అమలాపురం పట్టణంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల్లో నిత్యం ఈ తరహా కేసులు భారీగానే నమోదవుతున్నాయి.

అధ్వానంగా పరిసరాలు

డ్రైన్లలో మురుగునీరు స్తంభించిపోవడం, కొన్ని ప్రాంతాల్లో అవి పొంగి ఖాళీ స్థలాల్లో భారీగా నీరు చేరడం వంటి పరిణామాల వల్ల పరిసరాలు కలుషితమై దోమలు పెరిగిపోతున్నాయి. వీటిలో డెంగ్యూ కారక దోమలు కుట్టడంతో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు ఫాగింగ్ యంత్రాల ద్వారా మెయిన్ రోడ్లలోనే పొగ పెడుతున్నప్పటికీ చిన్నచిన్న వీధుల్లో వాహనాలు వెళ్లే మార్గం లేక దోమలు నివారణా చర్యలు సాధ్యం కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలాల్లో పెరిగిపోతున్న చెత్తా చెదారాలను తొలగించే విధంగా యజమానులకు నోటీసులు ఇచ్చి వాటిని తొలగింప చేయడానికి చర్యలు చేపట్టాలని అమలాపురం పట్టణ ప్రజలు ముక్త కంఠంతో మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అమలాపురం, రామచంద్రపురం, మండపేట పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మిశ్రమ వాతావరణం వల్ల ప్రజలు అనేక అనారోగ్య సమస్యలకు గురై ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా అధికారులు జోక్యం చేసుకుని ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



అమలాపురంలో అధ్వానంగా డ్రైన్లు





అమలాపురంలో అధ్వానంగా ఉన్న మురుగు కాల్వ


ఓపీలో ఎక్కువ శాతం జ్వరాలే..

మండపేట, ఆగస్టు 24: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీలో 20 నుంచి 30 శాతం వరకు జ్వరాలతో బాధపడేవారు ఉంటున్నారు. గత 25 రోజుల నుంచి వైరల్ జ్వరాల కేసులు కూడా పెరుగుతున్నాయి. వాతావరణంలో మార్పులే జ్వరాలకు కారణమని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్యం లోపించటం, దోమలు వ్యాప్తి జ్వరాలు పెరుగుదలకు కారణమని వైద్యులు చెబుతున్నారు. చాలా ఇళ్లల్లో ఇద్దరు నుంచి ముగ్గురు వరకు జ్వర పీడితులే ఉంటున్నారు. దానికి తోడు తాగునీరు కలుషితం కావటం కూడా వైరల్ జ్వరాలకు కారణంగా తెలుస్తుంది. ఆస్పత్రులకు వస్తున్న రోగులకు వైద్యులు రక్తపరీక్షలు చేసి మందులను అందజేస్తున్నారు. ఇక ప్రభుత్వ ఆస్పత్రులలో ల్యాబ్‌లు, ప్రైవేటు ల్యాబ్‌లు కూడా రక్త పరీక్షలకు వచ్చేవారితో కిటకిటలాడుతున్నాయి. ప్రైవేటు ల్యాబ్‌లు ఇష్టానుసారంగా టెస్టుల పేరిట బిల్లులు వసూలు చేస్తున్నారు. వాటిపై నియంత్రణ లేకుండా పోయింది. ప్రైవేట్ ల్యాబ్‌లలో అర్హత లేని వారు సైతం పరీక్షలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా మండపేట సీఎస్‌సీకి వచ్చే రోగులలో ఓపీలో జ్వర పీడితులే ఎక్కువగా ఉన్నారని వారందరికి అవసరమైన వైద్య పరీక్షలు చేసి మందులను అందజేస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకుమారి తెలిపారు. అలాగే చికున్‌గున్యా, డెంగీ జ్వరాలు, దోమల ద్వారా వ్యాప్తి చెందుతాయని కాబట్టి దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ రాధాకుమారి ప్రజలకు సూచించారు. అలాగే కాచి చల్లార్చిన వేడి నీటిని తీసుకోవాలన్నారు. నిల్వ ఉంచిన ఆహారం తీసుకోవద్దని జ్వరం దగ్గు, తుమ్ములు ఆయాసం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సొంత వైద్యం మాత్రం చేసుకోవద్దని సూచించారు.

'వానపల్లి' ఆదర్శం కావాలి

సీఎం హామీలను నెరవేర్చాలి

అధికారులతో కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గ్రామ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చే దిశగా అధికార యంత్రాంగం పనిచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. వానపల్లిని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దాలన్నారు. చంద్రబాబు గ్రామ సభలో అందుకున్న గ్రీవెన్స్‌లను పరిష్కరించే దిశగా 48 గంటల్లోపు అధికారులు స్పీకింగ్ ఆర్డర్లు ఇవ్వాలన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. వానపల్లిలో చంద్రబాబు పర్యటన సందర్భంగా వివిధ సమస్యలపై 382 పిటిషన్లు అందాయని కలెక్టర్ తెలిపారు. ఆ పిటిషన్లు అన్నింటినీ శాఖల వారీగా పీజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. అధికారులంతా స్వయంగా దరఖాస్తులు పరిశీలించాలన్నారు. అందిన ఫిర్యాదుల్లో అత్యధికంగా రెవెన్యూశాఖకు సంబంధించి 127, వ్యవసాయశాఖ 76, హౌసింగ్ కార్పొరేషన్ 52, పెన్షన్ల కోసం 43, పశు సంవర్ధకశాఖ 21, బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు 16 ఫిర్యాదులు వచ్చాయన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా వానపల్లిలో వంద శాతం సీసీ రోడ్లు నిర్మించడానికి నలుగురు పంచాయతీరాజ్ ఏఈఈలతో ప్రత్యేక బృందాన్ని నియమించి ఎంత మేరకు రోడ్లు అవసరం, అయ్యే ఖర్చు ఎంత అనే అంశంపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. పంచాయతీలోని 24 హేబిటేషన్లలో టాయిలెట్లు, ప్రతీ ఇంటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటుచేసే దిశగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక బృందాలను నియమించి సర్వేచేసి నివేదిక సమర్పించాలన్నారు. గ్రామంలో పశువుల షెడ్లు నిర్మించే దిశగా ఆ శాఖ అధికారులు పనిచేయాలన్నారు. గ్రామంలో సమగ్ర సర్వే నిర్వహించి ఇల్లు లేనివారికి పక్కా గృహాలు నిర్మించే దిశగా డీటైల్ ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయాలని కొత్తపేట ఆర్డీవో, హౌసింగ్ శాఖ పీడీలను ఆదేశించారు. పళ్లాలమ్మ దేవస్థానం పరిసరాల్లో ఆహ్లాద భరితంగా పార్కును అభివృద్ధి చేసేందుకు రిపోర్టును తయారు చేసి పంపించాలన్నారు. మండల పరిధిలోని నారాయణలంక, కేదారలంకల్లో కృష్ణ జింకలను పరిరక్షించే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక అందించాలని జిల్లా ఫారెస్టు అధికారిని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, కొత్తపేట, అమలాపురం ఆర్డీవోలు వి.సత్యనారాయణ, జి.కేశవర్ధనరెడ్డి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ మదన్‌మోహన్, జిల్లా ఫారెస్టు అధికారి ఎన్వీ ప్రసాద్, హౌసింగ్ పీడీ పి.కూర్మినాయుడు, పంచాయతీరాజ్ ఈఈ కె.చంటిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఎస్.శ్రీనివాస్, ఇతర జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

'వాడపల్లి' వెంకన్న ఆలయం కిటకిట

వార్త..7లో

రెండు రోజుల క్రితం గొల్లవిల్లిలో వేసిన నాట్లు



ఇప్పట్లో రైతులను కష్టాలు వీడేటట్లు లేవు. ఈ సీజన్ వారికి ఏమాత్రం కలిసి రావడం లేదు. వరుస నష్టాలను చవిచూస్తున్నారు. చాలా రోజులు ముంపులో ఉన్న పొలాలు ఇటీవల బయటపడ్డాయి. దీంతో నష్ట నివారణ పనులు చేసుకుంటుండగా మళ్లీ ఇప్పుడు ముంపు ముప్పు వచ్చి పడింది. వందలాది ఎకరాల్లో నాట్లు నిండా మునిగాయి.. రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి..

మళ్లీ మునక..



ప్రస్తుతం నిండా మునిగిన నాట్లు

- రెండో దశ నాట్లకూ తప్పని ముంపు ముప్పు
- 1100 ఎకరాలల్లో మునిగిన సార్వా నాట్లు
- రైతుల ఆశలపై నీళ్లు..

ఉప్పలగుప్తం, ఆగస్టు 24: వ్యయప్రయాసల కోర్చి జూలైలో వేసిన సార్వా నాట్లు ముంపు బారిన పడ్డాయి. రెండు వారాల అనంతరం ముంపు నుంచి విముక్తి కల్గింది. నీట నానిన నాట్లు తెగుళ్ల బారిన పడ్డాయి. రంగు మారిన మూనలు దుబ్బు చేసే సామర్థ్యాన్ని కోల్పోయాయి. ముంపునీరు బయటకు పోవడంతో మొదటి దశలో 3,200 ఎకరాల విస్తీర్ణంలోని నాట్లు కొన ఊపిరితో ఉన్నాయి. వాటిని రక్షించుకునేందుకు అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. ముంపు భయం తొలగి, వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఆలస్యమైనా ఈ నెల మూడో వారం నుంచి రెండో దఫా నాట్ల ప్రక్రియను రైతులు ప్రారంభించారు. ఈ నెల 20వ తేదీ నాటికి 1,150 ఎకరాల విస్తీర్ణంలో నాట్లు వేశారు. నాట్లు ప్రక్రియ కొనసాగుతుండగానే మళ్లీ గత మూడు రోజులుగా కుండపోత వర్షాలు రావడంతో పొలాలు చెరువులుగా మారాయి. రైతుల ఆశలు అడుగంటాయి. నారు సిద్ధంగా ఉండటం, దమ్ము ఇంతకు ముందే పూర్తవ్వడంతో ఎంతోకొంత దిగుబడి రాకపోతుందా అన్న కొండంత ఆశతో రైతులు రెండో దఫా నాట్లకు ముందడుగు వేశారు. ముంపు పరిస్థితి మళ్లీ మొదటికి రావడంతో అయోమయంలో పడ్డారు. నాటిన వెంటనే ముంపు ముప్పును తట్టుకునే శక్తి వరి మూనలకు ఉండదని, నాట్లు కుళ్లిపోయే ప్రమాదముందని రైతులు వాపోతున్నారు.

నాట్లకు ముంపు ముప్పు

గతంలో లేని విధంగా ఈ ఏడాది సార్వాలో 5,500 ఎకరాల్లో నాట్లు వేయాలన్న లక్ష్యంతో రైతులు ఏర్పాట్లు చేసుకున్నారు. నారు సిద్ధం చేసుకుని, నాట్లకు పొలాలను దమ్ము చేసుకున్నారు. వాతావరణం అటుఇటుగా ఉన్నా ఎంతో శ్రమించి 3,200 ఎకరాల్లో నాట్లు వేశారు. అనంతరం వర్షాలకు నాట్లు ముంపు బారిన పడ్డాయి. ముంపు దిగే మార్గం లేక ఎక్కువ రోజులు వరి మూనలు నీటిలోనే ఉండి చీడ పీడలకు గురయ్యాయి. శాస్త్రజ్ఞుల సలహాల మేరకు నాట్లను కాపాడుకునేందుకు రైతులు చర్యలు ప్రారంభించారు. ముంపు భయం పోవడంతో మిగిలిన విస్తీర్ణంలోనూ నాట్లు వేసుకునేందుకు రైతులు ముందుకు వచ్చారు. అప్పటికే వరినారు వయస్సు 55 రోజులు దాటిపోయింది. ఏదోలా నాటి, 75 రోజుల దాటకుండా ఎరువుల వేత పూర్తిచేస్తే ఎంతోకొంత లాభముంటుందని రైతులు ఆశించారు. వాతావరణం ప్రతికూలించడంతో మళ్లీ నాట్లకు ముంపు ముప్పు ముంచుకొచ్చింది. కుండపోత వానలతో చేలు చెరువులుగా మారాయి. ప్రస్తుతం ఇంకా నాట్లు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పుడు నాట్లు వేస్తే రాబోయే ఈశాన్య రుతుపవనాల బెడద వల్ల పైరు దెబ్బతినే ప్రమాదముంది. తక్షణమే రైతులు సార్వా నాట్లను నిలిపివేయాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

31 వరకు

క్రీడా ఉత్సవాలు



అమలాపురం టౌన్, ఆగస్టు 24: హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నామని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 31వ తేదీ వరకు క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యా సంస్థలతో పాటు కళాశాలలు, క్రీడా సంఘాలు, వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయి. దీనిలో భాగంగా అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో 26న క్రీడాకారులచే ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, 27న 18 నుంచి 60 ఏళ్ల వయసు గల వివిధ విభాగాల క్రీడాకారులకు వివిధ క్రీడలు నిర్వహిస్తారు. 28న పిల్లలకు క్రీడా పోటీలు జరుగుతాయి. 29న 3కే ర్యాలీ నిర్వహించి అత్యుత్తమ క్రీడాకారులను సన్మానిస్తారు. 30, 31 తేదీల్లో సామాజిక మాధ్యమాల ద్వారా క్రీడా ఐకృత, సృజనాత్మక క్రీడా చిత్రాలు, లఘు చిత్రాలు, వ్యాసరచన, చిత్రకళల ప్రదర్శన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని సురేష్‌కుమార్ తెలిపారు.

క్రీడాకారులకు సత్కారం

ఈ నెల 29న జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను సత్కరించనున్నట్టు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. 2023 ఆగస్టు 24 నుంచి ఈ ఏడాది ఆగస్టు 25వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల ద్వారా అంతర్జాతీయ స్థాయి, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన వారిని జిల్లా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సత్కరిస్తామన్నారు. పతకాలు సాధించిన వివిధ విభాగాలకు చెందిన క్రీడాకారులు ముందుగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయానికి దరఖాస్తులు అందించాలన్నారు. ఖేలో ఇండియా, యూనివర్సిటీ, స్కూల్ గేమ్స్ క్రీడాకారులు, వెటరన్ క్రీడాకారులు ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు అమలాపురంలోని కార్యాలయం వద్ద దరఖాస్తులు నేరుగా అందజేయాలన్నారు. సమయం దాటిన తర్వాత సమర్పించిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోమన్నారు. దరఖాస్తుతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న సర్టిఫికెట్లు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ 7993329433ని సంప్రదించాలన్నారు.



పూజలు నిర్వహించుకుంటున్న భక్తులు

శనేశ్వర ఆలయంలో పూజలు

కొత్తపేట, ఆగస్టు 24: మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామి వారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనములకు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,62,126 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనరు, ఈవో కె.వి జయలక్ష్మి తెలిపారు.



పండుగొప్ప

అల్లవరం, ఆగస్టు 24: వైనతేయ గోదావరిలో వేటగాళ్లకు 27 కిలోల భారీ పండుగొప్ప చిక్కింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు వైనతేయ గోదావరిలో లభ్యమైన 27 కిలోల భారీ చేపను వంతెన వద్ద మార్కెట్‌లో అమ్మడానికి ఉంచారు. చేపల వ్యాపారి కె.వెంకటలక్ష్మి చేపను రూ.14 వేలకు విక్రయించింది.



అర్ధరాత్రి గంజాయి ముఠా కోసం
పోలీసుల చేజింగ్

- నెల్లూరు రూరల్ డీఎస్పీపైకి దూసుకెళ్లిన కారు
- నెల్లూరు, తిరుపతి పోలీసుల అప్రమత్తం
- గూడూరు మీదుగా కడప జిల్లాలోకి వెళ్లే ప్రయత్నం
- అడుగడుగునా వెంబడించిన పోలీసులు
- చేజింగ్‌లో కాలువలోకి దూసుకెళ్లిన సీఐ వాహనం
- రోడ్డు లేకపోవడంతో పొలాల్లో ఆగిన కారు
- డ్రైవర్ అరెస్టు.. మరో ఇద్దరు ఏమయ్యారు?
- పూర్తిస్థాయిలో విచారిస్తున్న పోలీసులు
- డ్రైవర్ సూర్యనారాయణది రాజానగరం





కల్వర్టును ఢీకొని కాలువలోకి దూసుకెళ్లిన ఆత్మకూరు సీఐ వాహనం... పోలీసుల అదుపులో కారు డ్రైవర్ సూర్యనారాయణ

నెల్లూరు(క్రైం)/వెంకటాచలం/మర్రిపాడు, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం దుంగలు, గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠాలను పట్టుకునేందుకు పోలీసు వాహనాలు రయ్.. రయ్.. మంటూ దూసుకుపోయే దృశ్యాలు సినిమాల్లో చూస్తుంటాం. సాహసోపేత చేజింగ్‌లు చేసి చివరకు దొంగలను పట్టుకుంటారు. అలాంటి సీన్ నెల్లూరు జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సాగింది. ఓ గంజాయి ముఠాను పట్టుకునేందుకు నెల్లూరు, తిరుపతి జిల్లాల పోలీసులు రాత్రంతా కంటిమీద కునుకులేకుండా కష్ట పడ్డారు. చివరకు కారుతోపాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ చేజింగ్‌లో డీఎస్పీ గాయాలపాలవగా, ఇద్దరు సీఐలకు తృటిలో ప్రమాదం తప్పింది.

● అసలేం జరిగిందంటే..

విశాఖ నుంచి చెన్నైకు ఓ వాహనంలో భారీగా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం శుక్రవారం రాత్రి నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్‌రావు అందింది. వెంటనే ఆయన కోవూరు పోలీసులను అప్రమత్తం చేశారు. ఈలోపు ఏపీ39డీజే1000 నెంబరు గల తెలుపురంగు కారు వేగంగా లారీల మధ్యలో దూసుకెళ్లింది. ఈ విషయాన్ని పోలీసు అధికారులకు తెలియజేశారు. వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద అర్ధరాత్రి రూరల్ డీఎస్పీ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. సరిగ్గా 1.30 గంటల ప్రాంతంలో కోవూరు పోలీసులు తెలిపిన నెంబరు గల కారు అక్కడకు రావడంతో ఆపారు. డ్రైవర్ పక్కగా నిలపగా తనిఖీ చేసేందుకు డీఎస్పీ వెళ్లారు. ఒక్కసారి కారు వాయువేగంతో ముందుకు దూసుకెళ్లింది. దీంతో డీఎస్పీ కింద పడటంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందజేసి, అప్రమత్తం చేశారు. తిరుపతి జిల్లా పోలీసులకూ సమాచారం ఇచ్చారు. గాయపడిన డీఎస్పీని నెల్లూరులోని ఓ ప్రైవేటు అసుపత్రికి తరలించారు.

● 3 గంటలు టెన్షన్.. టెన్షన్

వెంకటాచలం టోల్‌ప్లాజా నుంచి దూసుకెళ్లిన కారు తెల్లవారుజామున 4.20 గంటల వరకు మూడు గంటలపాటు పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేసింది. వెంకటాచలం దాటిన తర్వాత బూదనం టోల్‌ప్లాజా వద్దకు కారు వస్తుందని తిరుపతి జిల్లా పోలీసులు అక్కడ కాపుకాశారు. అయితే అనూహ్యంగా గూడూరు పట్టణంలోకి వెళ్లి పాత బస్టాండు వద్ద విధుల్లో ఉన్న వాకాడు ఇన్‌స్పెక్టర్ హుస్సేన్ బాషా, పోలీసులపైకి దూసుకెళ్లింది. రెప్పపాటులో వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. అక్కడ నుంచి పొదలకూరు మీదుగా చేజర్ల, కలువాయి, అప్పారావుపాలెం, ఆత్మకూరు మీదుగా కడప వెళ్లేందుకు డ్రైవర్ ప్రయత్నించాడు.

● పొలాల్లోకి వెళ్లి దొరికిపోయి..

జిల్లావ్యాప్తంగా అప్రమత్తమైన పోలీసులు ప్రతి కూడలిలో తనిఖీలు ముమ్మరం చేశారు. నెల్లూరు-ముంబయి రహదారిలోని మర్రిపాడు మండలంలోని డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద కాపుకాశారు. టోల్‌ప్లాజా ముందున కోనసముద్రం గ్రామం వైపు తెల్లవారుజామున 4.20 గంటలకు తెలుపు రంగు కారు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆత్మకూరు సీఐ గంగాధర్ తన సిబ్బందితో కారును వెంటాడారు. అయితే కోనసముద్రం సమీపంలో మలుపు వద్ద కల్వర్టుపై సిమెంట్ దిమ్మెను సీఐ కారును ఢీకొని కాలువలోకి దూసుకెళ్లింది. అయితే వెనుకే వస్తున్న మరో పోలీసు వాహనం కారును వెంటాడింది. కోనసముద్రం గ్రామం దాటాక పొలాలు మాత్రమే ఉండటంతో రోడ్డు లేక కారు అక్కడే ఆగిపోయింది. వెంటనే పోలీసులు కారుతోపాటు డ్రైవర్ సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని రాజానగరం వాసిగా పోలీసులు గుర్తించారు.

● గంజాయి ఏమైంది!?

వెంకటాచలం వద్ద కారులో డ్రైవర్‌తోపాటు ముగ్గురు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అయితే, డ్రైవర్ మాత్రమే పట్టుబడటంతో మిగిలిన ఇద్దరు ఏమయ్యారని పోలీసులు ఆరా తీస్తున్నారు. కారు రవాణా చేస్తున్న గంజాయి ఎక్కడ డంప్ చేసి ఉంటారని విచారిస్తున్నారు. ఏదిఏమైనా అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు టెన్షన్ పెట్టిన కారు చివరకు దొరకడంతో పోలీసులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు.



రామన్నపాలెం జంక్షన్ వద్ద పట్టుబడిన గంజాయి బస్తాలు

813 కిలోల గంజాయి స్వాధీనం

గోకవరం, ఆగస్టు 24: బొలెరో వాహనంలో రవాణా చేస్తున్న 813.590 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు గోకవరం ఎస్ఐ వీఎన్‌వీ పవన్‌కుమార్ తెలిపారు. గంజాయి రవాణా జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు గోకవరం మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ శివారు గ్రామమైన రామన్నపాలెం జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో బొలెరో ట్రక్ వాహనంలో తరలిస్తున్న గంజాయిని గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బొలెరో వాహనంలో గంజాయిని లెక్కించగా 25 ప్లాస్టిక్ గోనె సంచుల్లో 813.590 కిలోలు ఉన్నట్టు నిర్ధారించారు. దీని విలువ రూ.40,67,950 ఉంటుందని, నిందితుల ఆచూకీ తెలియాల్సి ఉందని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. కేసులో ప్రతిభ కనబర్చిన సిబ్బందిని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.



పట్టుకున్న నిందితుల వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ పంకజ్ కుమార్‌మీనా

350 కిలోల గంజాయి స్వాధీనం

మోతుగూడెం, ఆగస్టు24: ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశాలతో చింతూరు అడిషనల్ ఎస్పీ పంకజ్‌కుమార్ మీనా ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్ పోస్టు వద్ద మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు, తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో గంజాయిని తరలిస్తున్న వాహనాన్ని (టీఎస్ 07యూఏ 3969) ఆపి తనిఖీ చేయగా 350 కిలోల గంజాయి, 100 గ్రాముల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. ఒడిశాలోని కుర్మనూరుకు చెందిన రెడ్డి, మహారాష్ట్రకు చెందిన అన్వార్ అలీ సయ్యద్, యూనుస్ ముస్తాఫ్ షేక్ గంజాయికొని మోతుగూడెం గ్రామ శివారులోని అడవిలో దాన్ని ఈ వాహనంలోకి లోడ్ చేసి మహారాష్ట్రలోని లాతూర్‌కి తరలిస్తుండగా పట్టుకున్నామని అడిషనల్ ఎస్పీ చెప్పారు. ఒడిశాకు చెందిన రెడ్డి, మహారాష్ట్రకి చెందిన సతీష్‌లు పరారీలో ఉన్నారని, పట్టుకున్న గంజాయి విలువ రూ.17,60,00 విలువ ఉంటుందన్నారు. జూన్ ఒకటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలనకోసం 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చింతూరు సర్కిల్‌లో మొత్తం 16 కేసులు నమోదు చేసి, 43 మందిని అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి 1670 కేజీల గంజాయిని, 23 వాహనాలను సీజ్ చేశామని చెప్పారు.

సత్యదేవుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు



హైకోర్టు న్యాయమూర్తికి స్వామివారి మెమెంటో అందజేస్తున్న ఈవో

అన్నవరం, ఆగస్టు 24: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి సుమతి జగడం తన కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో స్వామివారి ప్రసాదం అందజేశారు.

పాదగయలోనూ పూజలు

పిఠాపురం, ఆగస్టు 24: పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని రాష్ట్ర హైకోర్టు జడ్జి జె.సుమతి శనివారం సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి పాదగయలోని కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు హైకోర్టు జడ్జికి క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ ఈవో, సహాయ కమిషనరు దుర్గాభవానీ హైకోర్టు జడ్జికి ప్రసాదాలు అందజేశారు. అనంతరం జడ్జి పిఠాపురంలో నిర్మించిన కోర్టు భవనాన్ని పరిశీలించారు. ఆమె వెంట పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి, సబ్ జడ్జి ఎం.బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి, అదనపు జడ్జి వంగా వెంకట అపర్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రాజారావు, కేఎస్ఆర్ భాస్కర్, ఉపాధ్యక్షుడు ఎస్ఎం అలీ పాల్గొన్నారు.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

భక్తవత్సల గోవింద!

వాడపల్లి ఒక్కరోజు ఆదాయం రూ.29.97 లక్షలు

ఆత్రేయపురం, ఆగస్టు 24: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. కాగా వివిధ సేవల ద్వారా స్వామి ఒక్కరోజు ఆదాయం రూ.29.97 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తజనం



పెద్దాపురం, ఆగస్టు 24: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునుంచే బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,19,700 అన్నదాన విరాళాలు రూ.57,488 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.7,080, తులాభారం ద్వారా రూ.750, లడ్డూ ప్రసాద విక్రయం ద్వారా రూ. 18,990 వెరసి రూ.2,04,008 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వి.శ్రీనివాసరావు తెలిపారు. సుమారు మూడు వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.1.94 లక్షలు

మామిడికుదురు, ఆగస్టు 24: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.1,94,143 ఆదాయం సమకూరిందని సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. బాలబాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని మొత్తం 2,693 మంది దర్శించుకున్నారు. 1,875 మంది స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. అన్నదానానికి ఆదుర్రు గ్రామానికి చెందిన పంతాడి కామేశ్వరవర్మ-పద్మలత దంపతులు రూ.10,116 విరాళం అందించారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి అభినందించారు.

వచ్చే నెల 14న లోక్ అదాలత్

రాజమహేంద్రవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 14న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 15 కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. ఆ రోజున ఉదయం పది గంటల నుంచి రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రాపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో ఏర్పాటు చేసే ప్రత్యేక బెంచ్‌లలో విచారణ పెండింగ్‌లో ఉన్న సివిల్, ప్రమాదాలు, బ్యాంకు కేసులతోపాటు రాజీకి అర్హమైన క్రిమినల్, ప్రీ-లిటిగేషన్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తారన్నారు. న్యాయవాదిని నియమించుకోలేని వారు, చదవడం, రాయడం రాని వారు కూడా నేరుగా ఆయా కోర్టు ప్రాంగణాల్లో ఉన్న న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే న్యాయ సహాయం అందజేస్తారన్నారు. లోక్ అదాలత్‌లో కేసును పరి ష్కరించుకోవడం వల్ల ఇరు పక్షాలకూ సమయం, ఖర్చు ఆదా అవుతాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీడీజే గంధం సునీత ఒక ప్రకటనలో కోరారు.

గాడిద పాలు తాగితే.. రోగాలు తగ్గుతాయా!?



వీధుల్లో గాడిద ను వెంటబెట్టుకుని పాలు అమ్ముతామని తిరుగుతున్న వ్యక్తి

ఉబ్బసం, దగ్గు, నడుమునొప్పులు పోతాయని అమ్మకాలు

తెలంగాణ నుంచి వచ్చి రాజమహేంద్రవరంలో విక్రయాలు.. కప్పు గాడిద పాలు రూ.300

కేవలం ఇది నమ్మకమే తప్ప శాస్త్రీయత లేదంటున్న వెటర్నరీ డీడీ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 24: గాడిదలా పెరిగావు..? పనికిరాని గాడిద..? పూర్వం ఖాళీగా తిరిగే వాళ్లను మన పూర్వీకులు అనే మాటలివి.. ప్రస్తుతం ఈ మాట అనడానికి ఎవ్వరూ సరిపోరు. ఎందుకంటే నేటి తరం గాడిదలూ పనికొస్తాయని నిరూపించారు. అదెలా గంటే.. కొన్ని రకాల రోగాలకు గాడిద పాలు పనిచేస్తాయని తెలియడంతో వాటికి డిమాండ్ ఏర్పడింది. గాడిద పాల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందినవారు గాడిదలను పెంచుతూ వాటిని తీసుకుని ఆంధ్రప్రదేశ్‌లో రాజమహేంద్రవరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో 15 రోజులు ఉండి ప్రతి రోజు ఉదయం 6 నుంచి 7:30 గంటల మధ్య వీధుల వెంబడి తిరుగుతూ స్వయంగా గాడిదలను తీసుకువచ్చి కప్పు వరకు పిండి వాటిని విక్రయిస్తున్నారు. శనివారం రాజమహేంద్రవరంలో చిన్నగ్లాసు రూ.200, టీ కప్పు రూ.300 లకు విక్రయించారు. గాడిద పాలు ఉబ్బసం, దగ్గు, కఫం, నడుమ నొప్పులకు చాలా మంచిదని ఆ పాలు అమ్మేవారు చెబుతుండడంతో డిమాండ్ బాగా పెరిగింది. సగటున రోజుకు ఐదు కప్పుల గాడిద పాలు అమ్మడం కనిపించింది. వాస్తవానికి గాడిద రోజుకు 100 మిల్లీలీటర్ల పాలు మాత్రమే ఇస్తుంది. కానీ ఇక్కడ వీళ్ళు విక్రయించే పాలు చూస్తే 200 ఎంఎల్ ఉంటుంది కానీ ప్రజలు అవేమి ఆలోచించకపోవడం గమనార్హం. అయితే కొన్ని రకాల మందుల తయారీలో గాడిద పాలు వినియోగిస్తారే తప్ప నేరుగా తీసుకునే పరిస్థితి లేదనే వాదన ఉంది.

గాడిద పాలనేది నమ్మకం మాత్రమే



గాడిద పాలను తాగితే కొన్ని రకాల జబ్బులు తగ్గుతాయని అనుకోవడం ప్రజల నమ్మకం తప్పితే దానికి ఆధారాలులేవు. గతంలో నడుము పనిచేయని ముసలివాళ్ళు గాడిద మాంసం తింటే లేచిని లబడతారనే నానుడి ఉండేది. దగ్గు, కఫం వంటివి తగ్గుతాయని ప్రజలు నమ్ముతారే తప్ప దానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. పైగా రోజుకు 100 ఎంఎల్ పాలు మాత్రమే ఇచ్చే గాడిద 250 ఎంఎల్ వరకు పాలు ఎలా ఇస్తుంది. అంటే ఇప్పటికే ఆవులు, గేదేలు పాలు పెంచే ఆక్సిటోస్ ఇంజక్షన్ ప్రభుత్వం బ్యాన్ చేసింది. అది బయట మార్కెట్‌లో అక్రమంగా అమ్ముతున్నారనే అనుమానం ఉంది. ఆ ఇంజక్షన్ వినియోగించి గాడిద పాలు పెంచుకుని ప్రజలను మోసం చేసే అవకాశం ఉంది. ఇంజక్షన్ చేసిన పాలు తాగితే మోకాళ్ళ నొప్పులు వస్తాయి.

- డాక్టర్ వెంకటేశ్వరావు, డీడీ పశుసంవర్ధక శాఖ, తూర్పుగోదావరి జిల్లా



సమావేశంలో మాట్లాడుతున్న జలగం కుమారస్వామి

28న అమలాపురంలో అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సు

అమలాపురం టౌన్, ఆగస్టు24: కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార మార్గాలు పొందాలనే లక్ష్యంతో ఈనెల 28న అమలాపురంలో అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సు నిర్వహిస్తున్నట్టు భారతీయ కిసాన్‌సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమారస్వామి పేర్కొన్నారు. కొబ్బరి రైతులు తెగుళ్ల బెడదతోపాటు దిగుబడులు తగ్గిపోయి కొబ్బరికాయలకు ధర లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని అధిగించే విధంగా ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో శనివారం బీకేఎస్ జిల్లాశాఖ అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న ఈదరపల్లిలోని జనహిత కార్యాలయంలో దక్షిణ భారతదేశానికి చెందిన కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాలకు చెందిన కొబ్బరి రైతులతో ముందస్తు సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో మార్కెటింగ్ వ్యవస్థ వల్ల కొబ్బరి రైతులకు కలుగుతున్న మేలు, నష్టాలపై చర్చించడంతోపాటు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలు, అందించాల్సిన ప్రోత్సాహకాలపై పలు తీర్మానాలు రూపొందించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొబ్బరికాయలు కొనుగోలు చేయాలని ఆదేశించి నిర్దిష్ట ధరను ప్రకటించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు ఆ విధంగా కొనుగోలు వ్యవస్థలను ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని వివరించారు. ఈనెల 28న అమలాపురం కిమ్స్ ప్రాంగణంలో అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సును నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సులో బీకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహినీమోహనమిశ్రా, అఖిలభారత ఉపాధ్యక్షుడు పెరుమాళ్ల పాల్గొని కొబ్బరి రైతులకు మార్గదర్శకం చేస్తారన్నారు. ఈ సదస్సులో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొంటారన్నారు. సదస్సుల్లో ఆమోదించిన తీర్మానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి బీకేఎస్ తరఫున తీసుకువెళతామని జిల్లా అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం తెలిపారు. సమావేశంలో పూర్వపు జిల్లా అధ్యక్షుడు బొక్కా ఆదినారాయణ, సీనియర్ నాయకులు ఉప్పుగంటి భాస్కరరావు, అడ్డాల గోపాలకృష్ణ, తిక్కిరెడ్డి గోపాలకృష్ణ, మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ, సూర్యనారాయణరాజు, అప్పారి వెంకటరమణ పాల్గొన్నారు.

కుమార్తె ఆరోగ్యం బాగాలేదని ఇంటికి వెళుతూ

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయిని మృతి





లారీ ఢీకొని మృతి చెందిన ఉపాధ్యాయిని.. రాజారత్నం (ఫైల్‌ఫొటో)

కొవ్వూరు, ఆగస్టు 24: కొవ్వూరు మండలం దేచర్ల గ్రామంలో లారీ ఢీకొని ఉపాధ్యాయురాలు మృతి చెందింది. రాజమహేంద్రవరం కంబాలచెరువు ప్రాంతానికి చెందిన బడుగు రాజారత్నం(47) దేవరపల్లి మండలం గౌరీపట్నం హైస్కూల్లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్నారు. కుమార్తె నిషితకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో 5 రోజులు మెడికల్ లీవు పెట్టడానికి పాఠశాలకు రాజమహేంద్రవరం నుంచి బస్సులో వచ్చారు. పని ముగించుకుని ఇంటికి వెళ్లడానికి పాఠశాలలో పనిచేస్తున్న లెక్కల మాష్టారు కదిరి మురళీకృష్ణప్రసాద్‌ను గౌరీపట్నం సెంటరులో బైక్‌పై డ్రాప్ చేయాలని కోరారు. గౌరీపట్నం సెంటర్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలుపుదల చేయకపోవడంతో పంగిడి సెంటర్‌లో డ్రాప్ చేయాలని కోరడంతో ఇద్దరూ బైక్‌పై బయలుదేరారు. వర్షం కారణంగా రోడ్డు పక్కన మట్టి చేరడంతో దేచర్లలోని త్రివేణి ఫ్యాక్టరీ సమీపంలో బైక్ జారడంతో కిందపడిపోయారు. మురళీకృష్ణప్రసాద్ పైకిలేచి చూసేసరికి వెనుక వస్తున్న లారీ రాజారత్నం తలపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కొవ్వూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త వి.రాజేంద్ర ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.శ్రీహరి కేసు నమోదు చేశారు.

బెహ్రాయిన్‌లో మరణించిన నాగసాయి మృతదేహం స్వగ్రామానికి..



మామిడికుదురు, ఆగస్టు24: ఉపాధి కోసం పరాయి దేశం బెహ్రాయిన్ వెళ్లి అక్కడ ఆత్మహత్యకు పాల్పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పెదపట్నంలంక గ్రామానికి చెందిన నాగులపల్లి వీరవెంకటదుర్గానాగసాయి (22) మృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరుకుంది. కుటుంబానికి అండగా నిలుస్తాడనుకున్న కుమారుడు మృతదేహంగా తిరిగి రావడంతో తల్లి అనంతలక్ష్మి, చెల్లి భానులక్ష్మి విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. కుటుంబానికి అండగా నిలుస్తాడని అనుకున్న కుమారుడికి అప్పుడే నిండు నూరేళ్లు నిండిపోయ్యాయని తల్లి రోదిస్తున్న తీరు కలచివేసింది. ఈ ఏడాది జూలై 29న ఉపాధి కోసం బెహ్రాయిన్ వెళ్లిన దుర్గానాగసాయి అక్కడ పెట్రోలు బంకులో పనిచేస్తూ ఈనెల 17న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. సాయి మృతదేహానికి శుక్రవారం రాత్రే స్థానిక శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

- ఘనంగా ఉట్టు కొట్టే కార్యక్రమం
- గోపిక, కృష్ణుడు, రాధ వేషధారణల్లో విద్యార్థులు
- గోపికల వేషధారణలతో గోకులం కార్యక్రమం

యువత పారిశ్రామికంగా ముందుకు రావాలి

మలికిపురం, ఆగస్టు 24: యువత పారిశ్రామికంగా ముందుకు వచ్చి పలువురికి అవకాశాలు కల్పించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురంలో శ్రీలక్ష్మీతేజ ట్రేడర్స్ అండ్ జనరల్ వ్యాపార సంస్థను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, మంగెన భూదేవి, బందెల పద్మ, లింగోలు పెద్దబ్బులు, ముప్పర్తి నాని, గుండుబోగుల పెద్దకాపు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘ భవనం అభివృద్ధికి కృషి: మంత్రి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు24: శెట్టిబలిజ సంఘం భవనం అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం స్థానిక శెట్టిబలిజ కల్యాణ మండపంలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం రాజకీయ ఒత్తిడిలకు దూరంగా ఉండాలన్నారు సంఘీయులు ప్రశ్నించే తత్వం అలవాటు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు పెద్దలు సంఘాన్ని రాజకీయాలకు ఉపయోగించుకున్నారన్నారు. రామచంద్రపురం తాలూకా శెట్టిబలిజ సంఘం భవనం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కొద్దినెలల్లోనే సంఘం భవనం అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. సమావేశంలో టేకుమూడి సత్యనారాయణ, పలివెల వెంకటరమణ, దంగేటి నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, దంగేటి గౌరీ శంకర్, పలువురు సంఘీయులు పాల్గొన్నారు

అధికారుల నిర్లక్ష్యం.. నీట మునిగిన చేలు

మామిడికుదురు, ఆగస్టు 24: జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్యం కారణంగా డ్రెయిన్‌లో నీరు వరి చేలల్లోకి రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఏర్పాటుచేసిన బైపాస్ రోడ్డును పంట పొలాల మధ్య నుంచి ఏర్పాటు చేశారు. అధికారులకు సరైన అవగాహన లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడు చేలల్లోని వర్షం నీరు దిగేందుకు అవసరమైన తూరలు ఏర్పాటు చేయకపోవడంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరి చేలు నీట నానుతున్నాయి. మామిడికుదురులో బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న వంతెన నిర్మాణం దృష్ట్యా ఏర్పాటు చేసిన ప్రాంతంలో వాడ్రేవుపల్లి మీడియం డ్రెయిన్‌పై అడ్డుకట్ట వేయడంతో డ్రెయిన్‌లోకి వచ్చిన నీరు పంట పొలాల్లోకి ప్రవహిస్తుందని రైతులు పేర్కొంటున్నారు. వంద ఎకరాల



మామిడికుదురులో డ్రెయిన్‌లో నీరు చేరడంతో జలమయమైన వరి చేలు

పొలాల్లోకి వర్షం నీరు చేరడంతో చేలు చెరువులను తలపిస్తున్నాయని రైతులు తెలిపారు. సంబంధిత అధికారులు చేలల్లో చేరిన వర్షం నీటిని డ్రెయిన్‌లోకి వెళ్లే విధంగా జేసీబీతో గాడి ఏర్పాటుచేసే పనులను శనివారం మొదలుపెట్టారు.

కుండపోత వర్షంతో జనజీవనం అస్తవ్యస్తం



భీమనపల్లిలో కాల్వలా మారిన దృశ్యం

ఉప్పలగుప్తం, ఆగస్టు 24: నాలుగు రోజులుగా ప్రతిరోజూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కుండపోత వర్షంతో జనం ఇబ్బందులు పడ్డారు. శనివారం వాన మరింతగా విజృంభించడంతో చేలు చెరువులుగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లో వీధులు, రహదారులు జలమయమయ్యాయి. సిరిపల్లి-మునిపల్లి ఆర్అండ్‌బీ రహదారి భీమనపల్లిలో కాల్వలా మారడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. గొల్లవిల్లి ఎన్టీఆర్ కాలనీలో ఇళ్లల్లోకి నీరు చేరింది. సన్నవిల్లి- ఉప్పూడి రహదారి గోతుల్లో నీరు చేరి వాహనచోదకులు నానా ఇబ్బందులకు గురయ్యారు. సమనస- నంగవరం రహదారి మరింత దారుణంగా మారడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు.

చెకుముకి సైన్స్ సంబరాలతో సైన్స్‌పై ఆసక్తి



జనవిజ్ఞాన వేదిక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో కమలకుమారి

ముమ్మిడివరం, ఆగస్టు 24: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సైన్స్ పట్ల ఆసక్తి, చదువు పట్ల ఇష్టాన్ని కలిగించేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు ఎంతో ఉపయోగపడతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి చెప్పారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాల వాల్ పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో ఎం.కమలకుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులందరూ చెకుముకి సైన్స్ పరీక్షలకు హాజరయ్యేలా ప్రోత్సహించాలని ఆమె విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్‌లను కోరారు. జనవిజ్ఞాన వేదిక అమలు చేస్తున్న కార్యక్రమాలను ఆమె అభినందించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు జనిపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సెప్టెంబరు 1న పాఠశాల స్థాయి, 25న మండల పట్టణ స్థాయి, అక్టోబరు 27న జిల్లా స్థాయి, నవంబరు 9,10తేదీల్లో రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలు నిర్వహిస్తారన్నారు.జిల్లాఉపాధ్యక్షుడు కోలా వెంకటేశ్వరరావు, ఎంఈవో బొజ్జా రమణశ్రీ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు,చెకుముకి జిల్లా కన్వీనర్ ఎన్.అబ్బులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలపై సమావేశం

అమలాపురం టౌన్, ఆగస్టు 24: జనసేన వ్యవస్థాపకుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని నాయకులు నిర్ణయించారు. సీనియర్ నాయకుడు నల్లా శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం ఓ హోటల్‌లో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. గ్రూపు రాజకీయాలకు తావు లేకుండా అందరూ ఐక్యతతో సెప్టెంబరు 2న జరిగే పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల కార్యక్రమాలను విజయవంతం చేయాలని శ్రీధర్ కోరారు. పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఈనెల 31, సెప్టెంబరు 1వ తేదీల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రత్యేక కార్యాచరణ ప్రకటించారు. సమావేశంలో నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, కంచిపల్లి అబ్బులు, లింగోలు పండు, యేడిద శ్రీను, నల్లా అజయ్, కొవ్వుల నాగమానస, మహదశ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

31న యువతులకు ఉద్యోగ మేళా

మండపేట, ఆగస్టు 24: మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 31న మహిళా యువతుల కోసం ప్రత్యేకంగా ఉద్యోగ మేళానిర్వహిస్తున్నట్టు మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.టి.టి.వి.శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్, డిగ్రీ అర్హతతో వివిధ సంస్థలకు చెందిన కంపెనీల్లో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. రూ.17వేలనుంచి వేతన ప్రారంభం అవుతుందన్నారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సెమినార్ విజయవంతం కావడంతో కళాశాల అధ్యాపకులకు, ఉద్యోగులకు, సిబ్బందికి ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు ఈఏడాది డిసెంబరులో మరో అంతర్జాతీయ సెమినార్ నిర్వహిస్తామన్నారు.

పాఠశాలల్లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు







యానాంలో రాధాకృష్ణుల వేషధారణల్లో చిన్నారులు, ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూల్‌లో వేషధారణల్లో చిన్నారులు, అమలాపురం: విద్యానిధిలో రాధాకృష్ణులు, గోపికలతో గోకులం

యానాం, ఆగస్టు 24: యానాంలోని వివిధ పాఠశాలల్లో ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్థానిక యర్రా గార్డెన్స్‌లోని నల్లం రెసిడెన్షియల్ కాన్సెప్ట్ పాఠశాలలో వేడుకలను నల్లం విద్యా సంస్థల చైర్మన్ నల్లం నాగాబాబు ప్రారంభించారు. విద్యార్థులు గోపిక, కృష్ణుడు, రాధ వేషధారణలతో అలరించారు. అనంతరం ఉట్టు కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నల్లం విద్యా సంస్థల వైస్ చైర్మన్ నల్లం ప్రవీణ, డైరెక్టర్ ఆకుల నాగలక్ష్మి, పాఠశాల హెచ్ఎం ఎస్.రవికుమార్ పాల్గొన్నారు. యానాం రీజెన్సీ పాఠశాల, నారాయణ టెక్నో పాఠశాల, డ్రీమ్స్ ఫౌండేషన్ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గోపిక, కృష్ణుడు, రాధ వేషధారణలతో వేషధారణలతో ఆకట్టుకున్నారు.

అమలాపురంటౌన్: శ్రీకృష్ణజన్మాష్టమివేడుకలను ముందుగానే శనివారం పలు పాఠశాలల్లో నిర్వహించారు. అమలాపురం విద్యానిధి విద్యార్థులు రాధాకృష్ణులు, గోపికల వేషధారణలతో నిర్వహించిన గోకులం కార్యక్రమం ఆకట్టుకుంది. విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు, డైరెక్టర్ ఎ.శ్యామలామహాలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వంద మంది వేషధారణలతో చేపట్టిన ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కృష్ణాష్టమి విశిష్టతను సర్ సీవీ రామన్ వివరించారు. విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణల్లో అలరించారు.

ఆలమూరు: ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూల్‌లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఉత్సవాలను ముందుగా స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు ప్రారంభించి కృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఉట్టు కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

దాతల ఔదార్యం ప్రశంసనీయం

మలికిపురం, ఆగస్టు24: విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న ఔదార్యం ప్రశంసనీయమని బట్టేలంక సర్పంచ్ బోనం సీతారత్నం అన్నారు. బట్టేలంక అల్లూరితిమ్మరాజు మెమోరియల్ జడ్పీ హైస్కూలు, బాలికల కళాశాలలో ఇంటర్ చదువుతున్న 25మంది విద్యార్థినులకు రెండు జతల చొప్పున నెల్లూరుకు చెందిన పర్రెడ్డి అశోక్‌రెడ్డి తల్లి ఇందిర పేరున రూ.25వేలువిలువైన యూనిఫారాలను శనివారం అందజేశారు. ముదునూరి సీతారామరాజు, కేవీ రామచంద్రరాజు, కె.రమేష్‌రాజు, ఎస్ఎంసీచైర్మన్ ఎల్.దుర్గాప్రసాద్, ప్రిన్సిపాల్ ఎన్.హనుమంతరావు పాల్గొన్నారు.

ఎంఈవో హెలీనాకు ఘన సన్మానం

పి.గన్నవరం, ఆగస్టు 24: స్వాతంత్ర్య వేడుకల్లో కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్, మంత్రి సుభాష్, జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఉత్తమ సేవా పుస్కారాన్ని అందుకున్న ఎంఈవో కె.హెలీనాను శనివారం నాగుల్లంక స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 చింతా వీరభద్రానందం, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ అనిల్‌కుమార్, సంయుక్త కార్యదర్శి ఎండీ మోహిద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అంబాజీపేట, ఆగస్టు 24: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తమిళనాడులోని వేలూరుకు చెందిన స్కడ్డర్ మోమోరియల్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రూప్‌సలోమాన్ అన్నారు. స్థానిక స్త్రీల ఆసుపత్రి 58వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి సీఈవో డాక్టర్ ఎన్ఆర్డీ హెవార్డురాజ్ శిబిరాన్ని ప్రారంభించారు. 54మందికి దంత పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి

యానాం, ఆగస్టు24: యానాం నియోజవర్గంలోని అన్ని పరిశ్రమల్లోసేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దుర్గా ప్రసాద్ డిమాండ్ చేశారు. అనకాపల్లి ఫార్మ కంపెనీలో జరిగిన ప్రమాదానికి బాధ్యులెవరని ప్రశ్నిస్తూ యానాం పారిశ్రామిక వాడలోని గ్రీన్ పార్కు సెల్లం పరిశ్రమ వద్ద ధర్నా నిర్వహించారు. కార్మికుల భద్రత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే యాజమాన్యాలపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు కుంచే సత్యనారాయణ, శ్రీనివాస రావు, రాంబాబు, రాజు, దొరబాబు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

అంబాజీపేట, ఆగస్టు 24: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ఎంఈవో మోకా ప్రకాష్‌తో కలిసి పరిశీలించారు. హెచ్ఎం కడలి సాయిరామ్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల అవకతవకలపై సమాచారమిస్తే చర్యలు

సామాజిక తనిఖీలో రూ.1.16లక్షలు రికవరీ



మాట్లాడుతున్న పీడీ ఎస్.మధుసూదన్

పి.గన్నవరం, ఆగస్టు24: ఉపాధి హామీ పనుల అవతవకలపై రాత పూర్వకంగా సమాచారం అందిస్తే బాధ్యుతలపై చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ తెలి పారు. స్థానిక మండల పరిషత్‌లో శనివారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.8,31,13,642 నిధులు ఖర్చు జరిగిందని వీటిలో రూ.8,16,60,139 వేతనాలు రూపంలో, రూ.14,53,503 మెటీరియల్ రూపంలో నిధులుఖర్చయ్యాని తెలిపారు. దీనిపై ఈనెల12 నుంచి 23వరకు సామాజిక తనిఖీలు జరి గినట్లు వివరించారు. 20గ్రామాల్లో పంచాయతీరాజ్, ఎన్ఆర్ఈజీఎస్‌కు సంబంధించి రూ.13లక్షలు వరకు అవకతవకలు జరిగినట్టు సామాజిక తనిఖీ నివేదిక సిబ్బంది గుర్తించారన్నారు. దీనిలో రూ.11.84లక్షలకు సంబంధించి బిల్లులు చూపించారన్నారు. మిగిలిన పంచాయతీరాజ్ నుంచి రూ.31వేలు, ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.85వేలు మొత్తం రూ.1.16లక్షలు అవకతవకలు జరిగినట్లు నిరూపణ అయిందన్నారు. దీంతో రూ.1.16 లక్షలు రికవరీకి ఆదేశించామన్నారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, జిల్లా విజిలెన్స్ అధికారి కె.భీమేశ్వర్, ఏపీడీ మల్లికార్జున్, ఎంపీడీవో ఎం.భారతీ, అంబుడ్స్‌మేన్ ఎ.శ్రీనివాసరావు, సామాజిక తనిఖీ హెచ్ఆర్ కె.సత్యనారాయణ, ఎస్ఆర్‌పీ వి.కనకారావు, ఏపీవో సీహెచ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను రాజకీయం చేయవద్దు

ఉపాధిహామీ పనులను రాజకీయం చేయవద్దని ఉపాధి హామీ కూలీలు, మేట్లు డిమాండ్ చేశారు. మండల, స్థానిక ప్రజాప్రతినిధులకు వ్యతిరేకంగా నినాదాలు చేసి అధికారులకు వినతిపత్రం అందించారు. కూలీలకు పూర్తిస్థాయిలో పని కల్పించాలని వారు కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించండి: ఎమ్మెల్యే వేగుళ్ల



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, ఆగస్టు 24: వర్షా కాలం నేపథ్యంలో వలన గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేవం ఎంపీపీ నౌడు వెంకట రమణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. తాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గత ప్రభుత్వంలో ఇల్లు నిర్మించుకోలేని వారికి ఇప్పుడు ఇల్లు నిర్మించుకునే విధంగా అవగాహన కలిగించాలని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

కపిలేశ్వరపురం, ఆగస్టు 24: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శనివారం కాలేరులో సర్పంచ్ దాయం కావేరి శేఖర్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చుండ్రు అమ్మన్న, సావిత్రి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు వీరప్రతాప్, శ్రీనివాస్ ఏర్పాటు చేసిన సురక్షిత మంచినీటి ప్లాంట్‌ను ఎమ్మెల్యే వేగుళ్ల, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ ప్రారంభించారు. దాతలను వారు అభినందించారు. పంచాయతీ వద్ద గ్రామస్తులకువారు డస్ట్‌బిన్లు అందజేశారు. వల్లూరి కాశీ విశ్వనాథం, చుండ్రు రామకృష్ణచౌదరి, ముత్యాల సత్యనారాయణ, పెయ్యల యాకోబు, మత్తాల మధుసూదనరావు, వల్లూరు సర్పంచ్ దాసి మీనాకుమారి, తహశీల్దార్ చిన్నారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ భాగ్యరాజ్, కార్యదర్శి చినబాబు, వీఆర్‌వో సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపాతం

అమలాపురం టౌన్, ఆగస్టు 24: జిల్లాలో సగటున 33.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా రాజోలులో 95.4 మిల్లీమీటర్లు, అత్యల్పంగా కపిలేశ్వరపురంలో 7.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్రేయపురం25.6, మండపేట 9.6,రాయవరం 17.6, రామచంద్రపురం 17, ఆలమూరు 29.2, రావులపాలెం 20, కొత్తపేట 80.2, కె.గంగవరం 11.4, ఐ.పోలవరం 10.4, ముమ్మిడివరం 8.6, అయినవిల్లి 24.6, పి.గన్నవరం 18.4, అంబాజీపేట 56.2, మామిడికుదురు 68.6, మలికిపురం 15.4, సఖినేటిపల్లి 74, అల్లవరం 52.8, అమలాపురం 62.8, ఉప్పలగుప్తం 14.8, కాట్రేనికోనమండలంలో 24.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అవయవదానం చేసే వారు ఆదర్శప్రాయులు: మంత్రి



వరలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సుభాష్

కె.గంగవరం, ఆగస్టు24: అవయవదానం చేసిన వ్యక్తులు ఆదర్శప్రాయులని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఇటీవల కుందూరుకు చెందిన వాతం వరలక్ష్మి బ్రెయిన్‌డెడ్ కావడంతో కుటుంబ సభ్యుల అంగీకారంతో అవయవదానం చేశారు. కుందూరులో వరలక్ష్మికి ఆయన నివాళుల ర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎండూరి నరశింహమూర్తి ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. కూటమి నాయకుడు పామర్తి బాబి తండ్రి చంద్రరావు ఇటీవల మృతిచెందగా శనివారం బాబిని మంత్రి పరామర్శించారు. నెక్కంటి రాజబాబు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబసభ్యులను మంత్రి సుభాష్ పరామర్శించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన పిల్లి శ్రీనివాస్ కిడ్నీ సమస్యతో బాధపడుతున్న విషయం కూటమి నాయులు ద్వారా తెలుసుకుని రూ.5వేలు సాయం చేశారు.

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

అమలాపురం టౌన్, ఆగస్టు 24: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అమలాపురం జూనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు అన్నారు. స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వీకేఎస్ భాస్కరశాస్త్రి, డీవీవీఎస్ బాబి అనేక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం న్యాయమూర్తి గౌరీశంకర రావును సత్కరించారు. ప్రిన్సిపాల్ కేఎస్‌వీఎన్ మనోహర్, కరస్పాండెంట్ కే వీఆర్ఎన్ నరసింహారావు, వైస్ చైర్మన్ కరాటం ప్రవీణ్, వై.వరప్రసాద్, కె.శ్రావణ్‌దిలీప్, జాన్‌పాల్, సూర్యకుమారి, ఎస్.సంసోను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు

ముమ్మిడివరం, ఆగస్టు 24: రోడ్డు ప్రమాదంలో ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. స్పెషల్‌బ్రాంచి హెడ్‌కానిస్టేబుల్ మట్టపర్తి వీరవెంకటసత్యనారాయణ శనివారం ఉదయం మోటారుసైకిల్‌పై స్వగ్రామం అనాతవరం వాసంశెట్టివారిపాలెంలో ఇంటికి వెళ్తున్నారు. అయనను హోండా సిటీ కారు ఢీకొట్టింది. గాయపడ్డ హెచ్‌సీని అమలాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హెచ్‌సీ జి.భైరవస్వామి కేసు దర్యాప్తు చేపట్టారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: డిమోంటీ
శ్రీలలిత	: కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్క్రీన్-1	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
శేఖర్ స్క్రీన్-2	: డబుల్ ఇస్మార్ట్
రమా	: ఆయ్
గణపతి	: రేవు
వెంకటపద్మావతిస్క్రీన్-1	: తంగలాన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: ఏలియన్ రొమ్ములస్

లక్కవరం సొసైటీ అక్రమాలపై ఫిర్యాదు

మలికిపురం, ఆగస్టు 24: లక్కవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రూ.1.10కోట్లు అవకతవకలు జరిగినట్టు రైతులు వై.నాగేశ్వరరావు, ఎంవీ నరసింహారావు, ఆర్.కృష్ణమూర్తి, ఎస్.పెద్దిరాజు, ఎ.మోహనరాజు శనివారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసుల పరిశీలనలో సంఘంలో పనిచేసే ఉద్యోగి పాత్ర సీసీ కెమెరాలో నమోదైనట్టు తెలిపారు. 2023-24 సంవత్సరానికి ఆడిట్ చేయగా రూ.1.10కోట్లు అవకతవకలు జరిగినట్టు నమోదు చేశారన్నారు. విచారణ జరిపి అక్రమంగా కాజేసిన నిధులను రికవరీ చేయించాలని కోరారు.

ఎస్ఐగా జోషి



అయినవిల్లి, ఆగస్టు 24: అయినవిల్లి ఎస్ఐగా కేఎం జోషి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జోషిని పలువురు నాయకులు కలిసి అభినందించారు.

హైకోర్టు న్యాయమూర్తి పూజలు

అయినవిల్లి, ఆగస్టు 24: హైకోర్టు న్యాయమూర్తి టి.మల్లికార్జునరావు సతీ సమేతంగా శనివారం అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠాన్ని హైకోర్టు అడిషనల్ జడ్జి జగడం సుమతి కుటుంబ సమేతంగా దర్శించుకుని అమ్మవారికి పూజలు చేశారు. పీఠాధిపతి గాడ్ ఆశీసులు తీసుకున్నారు. వారి వెంట అనపర్తి జేఎఫ్ సీఎంఎం వంశీకృష్ణ ఉన్నారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు పాల్గొన్నారు.

వికాస్ సంస్థల వ్యవస్థాపకుడు వర్రే మృతి



మండపేట, ఆగస్టు 24:మండపేటకు చెందిన వికాస్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు వర్రె పట్టాభిరామన్న(87) శనివారం కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పట్టాభి రామన్న నేత్రాలను కుటుంబ సభ్యులు కాకినాడకు చెందిన బాదం బాలకృష్ణ ఐబ్యాంకుకు దానం చేశారు. రామయ్య మృతికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, ఛైర్‌పర్సన్ రాణి, కాపు సంఘం పట్టణ అధ్యక్షుడు జిన్నూరి సాయిబాబా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, పోతంశెట్టి ప్రసాద్ సంతాపం తెలిపారు.

గ్రామ సభల్లో 1,350 పనులు గుర్తింపు

కె.గంగవరం, ఆగస్టు 24: మండలంలోని 26గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ గ్రామసభల్లో 1350 పనులు గుర్తించినట్లు ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఉపాధిహామీ పనులు 950, సీసీ రోడ్లు 120, డ్రైన్లు 45, గోకులాలు 49, అంగన్‌వాడీ భవనాలు 2, బీటీ రోడ్లు 3 గుర్తించామన్నారు. వీటివిలువ రూ.12 కోట్లుగా ఉంటుందని అంచనా వేశామన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి ఆర్థిక సాయం

పి.గన్నవరం, ఆగస్టు 24: లంకలగన్నవరం శివారు డొక్కా సీతమ్మ కాలనీకి చెందిన కొల్లు రవీంద్ర కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. పి.గన్నవరం హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు సమకూర్చిన రూ.10,500 నగదును శనివారం హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్, ఉపాధ్యాయులు అతడికి అందించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ పి.దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శ

మండపేట, ఆగస్టు 24: ఏడిదలో పలు కుటుంబాలను ఎమ్మెల్యే జోగేశ్వరరావు పరామర్శించారు. గ్రామానికి చెందిన కిష్టంరాము, కొండపల్లి వీర్రాజు, నీలా దుర్గప్రసాద్ ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబసభ్యులను శనివా రం ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ గ్రామ అధ్యక్షుడు పర్వతిన వీర్రాజు, గొడవర్తి ఎర్రబ్బు, పలివెల దానియేలు, విదిశేఖర్, ప్రసాద్, రామిశెట్టి రాజా, పర్వతిన సుబ్బారావు, మేకా చిన్నబ్బు తదితరులు వున్నారు.

ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలి

ముమ్మిడివరం, ఆగస్టు24: విద్యార్థినులు లైంగిక ఆరోగ్యం పట్ల, నిగ్రహ శక్తి పట్ల కనీస అవగాహన కలిగి ఉండాలని జనకల్యాణ్ ఔట్రీచ్ ప్రతినిధి సీహెచ్ శాంతి సూచించారు. అమలాపురం జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ప్రివెన్షన్ యూనిట్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సీహెచ్‌పరిమళ అధ్యక్షతన శనివారం హెచ్ఐవీ, ఎయిడ్స్, లైంగిక వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రి ఐసీటీసీ కౌన్సిల్ పి.అంజిలిదేవి మాట్లాడారు. రాష్ట్ర డ్వాక్రా, అంగన్‌వాడీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మెండి కమల, జనకల్యాణ్ సిబ్బంది, ఏఎన్ఎం కె.వెంకటరమణి, గుర్రాల అమల, ఉపాధ్యాయులు, సిబ్బందిపాల్గొన్నారు.

సహకార సొసైటీలో అవకతవకలపై విచారణ

కపిలేశ్వరపురం, ఆగస్టు 24: నల్లూరు సహకార సొసైటీలో అవకతవలపై శనివారం అసిస్టెంట్ రిజిస్ట్రార్ వి.జవహార్ విచారణ చేపట్టారు. సహకార సొసైటీలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సొసైటీలో డిపాజిట్ల సొమ్ము రూ.79లక్షలు పక్కదారి పట్టినట్లు రైతులు ఇచ్చిన సమాచారంతో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు డీఆర్ దృష్టికి తీసుకువెళ్లారన్నారు. డీఆర్ ఆదేశంతో విచారణకు వచ్చినట్టు ఆయన తెలిపారు. సొసైటీలో ఫెర్టిలైజర్స్‌లో కూడా పలు అవకతవకలు జరిగినట్లు తన దృష్టికి వచ్చిందని, దీనిపై కూడా విచారణ జరుపుతామన్నారు. అవకతవకలపై పూర్తి విచారణ అనంతరం నివేదికను డీఆర్‌కు నివేదిస్తామని జవహర్ తెలిపారు.

పరిపాలనపై దృష్టి పెట్టాలి

రావులపాలెం, ఆగస్టు 24: ముఖ్యమంత్రి చంద్రబాబు జగన్‌ను విమర్శించడం మాని పరిపాలన, అభివృద్ధిపై దృష్టిపెట్టి ప్రజలకు మంచి పాలన అందించాలని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెం వైసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు మోసాలు, కుట్రలు, కక్ష సాధింపులు చేయడం తప్ప ప్రజలకు చేసిన మంచి ఏమీ లేదన్నారు. వానపల్లిలో జరిగిన సభలో ప్రభుత్వంపై, జగన్‌పై పలు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

బాలబాలాజీ స్వామి ఆలయ ఈవోగా సత్యనారాయణ



మామిడికుదురు, ఆగస్టు 24: అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారిగా వి.సత్యనారాయణ శనివారం బాధ్యలు స్వీకరించారు. ఆయన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం సహాయ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇన్‌చార్జి ఈవోగా వచ్చిన ఆయనకు ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు.

బీవీసీలో ముగిసిన డ్రోన్ టెక్నాలజీ అవగాహన

అల్లవరం, ఆగస్టు 24: ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్ ఈవిభాగం, హైదరాబాద్ ఎఫిట్ రీసెర్చ్ ల్యాబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్‌నెట్ థింక్స్, డ్రోన్ టెక్నాలజీపై వారంరోజులు జరిగిన వర్క్‌షాపు శనివారంతో ముగిసింది. డ్రోన్ టెక్నాలజీవల్ల ప్రయోజనాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రీసోర్స్‌పర్సన్ ఎల్.సూర్యప్రకాష్, కళాశాల సెక్రటరీ బోనం కనకయ్య, బోనం సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్‌వీ చంద్రమౌళి, డాక్టర్ ఏ.ప్రవీణ్, ఎస్.శ్రీకాంత్, ఎం.శ్రీనివాసరావు, శివనాగేంద్ర పాల్గొన్నారు.

కాలువలో యువకుడి గల్లంతు

ఆత్రేయపురం, ఆగస్టు 24: ప్రధాన పంట కాలువలో కాలు జారి వ్యక్తి గల్లంతయ్యాడు. మెర్లపాలేనికి చెందిన ముత్యాల శ్రీను(40) శుక్రవారం రాత్రి బహిర్భూమికి వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల గాలించగా కాలువలో కాలుజారి గల్లంతైనట్లుగా ఆనవాళ్లు కనిపించాయి. ముక్తేశ్వరం పంటకాలువలో అతడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు.

నీట్‌లో సాయికుమార్‌కు 416 ర్యాంకు



రాజోలు, ఆగస్టు 24: నీట్ పీజీ ఎంట్రాన్స్‌లో ఆలిండియా స్థాయిలో రాజోలు మండలం ములికిపల్లికి చెందిన కొడవలి సాయికుమార్ 416వ ర్యాంకు సాధించాడు. అతడి తండ్రి రాధాకృష్ణారావు కాంట్రాక్టరుగా పనిచేస్తున్నాడు. గతంలో నీట్ యూజీ రాష్ట్రస్థాయిలో 358ర్యాంకు సాధించి కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. సాయికుమార్‌ను గ్రామస్తులు అభినందించారు.

సాయికుమార్‌కు సన్మానం

మామిడికుదురు, ఆగస్టు 24: ఆలిండియా స్థాయిలో జరిగిన పీజీ నీట్ పరీక్షలో 416ర్యాంకు సాధించిన డాక్టర్ సాయికుమార్‌ను జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు శనివారం మగటపల్లిలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మద్దాల కృష్ణమూర్తి, కర్నీడి రామకృష్ణ, కొడవటి రాధాకృష్ణ, పెద్దిరెడ్డి చిన్నీ, కె.ప్రశాంత్‌కుమార్ పాల్గొని అభినందించారు.

గూడపల్లి విద్యార్థికి నీట్‌లో ర్యాంకు



మలికిపురం, ఆగస్టు 24: గూడపల్లికి చెందిన డాక్టర్ గంగుల కీర్తికి ఆలిండియా నీట్‌పీజీ ఎంట్రన్స్‌లో 1,654ర్యాంకు వచ్చినట్టు తండ్రి సత్యనారాయణ తెలిపారు. ఆమె తల్లిదండ్రులు కృష్ణకుమారి-సత్యనారాయణ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.ఎండీ రేడియాలజీ లేదా ఎండీ జనరల్ మెడిసిన్ చదువుతానని తెలిపింది. శనివారం గ్రామస్తులు, సర్పంచ్ సుందర తాతాజీ, సుందర బ్రహ్మయ్య, కె.గోపాలకృష్ణ తదితరులు ఆమెను అభినందించారు.

మోటారు సైకిల్ చోరీ

ముమ్మిడివరం, ఆగస్టు 24: ముమ్మిడివరం నగర పంచాయతీ పెద్ద వంతెన సమీపంలో పిల్లి నాగరాజుకు చెందిన బుల్లెట్ మోటారుసైకిల్‌ను ఇంటి ఆవరణలో ఉంచి తాళం వేశారు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆ మోటారుసైకిల్‌ను దొంగిలించుకుపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ యాప్ యాక్టివ్ సభ్యులకు ప్రశంసా పత్రాలు

కొత్తపేట, ఆగస్టు24: టీడీపీకి సంబంధించిన మన టీడీపీ యాప్‌లో నియోజకవర్గంలో యాక్టివ్‌గా పనిచేసిన పలువురు నాయకులకు పార్టీ ఆదేశాలతో శనివారం వాడపాలెంలో ప్రశంసాపత్రాలు అందించారు. కరుటూరి నరసింహారావు, చవల జగన్నాథం, పెండెం వెంకన్న, ముద్రగడ ఫణి, యర్రంశెట్టి వీరకృష్ణ, గొడవర్తి ప్రసాద్, కల్లూరి శ్రీను, కందుల రాంబాబు, వరదా సూరిబాబు, సిద్ధిరెడ్డి శ్రీనివాస్‌లకు ప్రశంసాపత్రాలు అందించారు.

యువకులకు కౌన్సిలింగ్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 24: ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కడియాల అశోక్‌కుమార్ హెచ్చరించారు. శనివారం రామచంద్రపురం బస్టాండులో సిబ్బందితో వెళ్లి విద్యార్థినులు బస్సు ఎక్కే సమయంలో యువకులు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడటాన్ని గుర్తించారు. యువకులకు సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈవ్‌టీజింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.